క్లుప్తంగా

వైభవంగా కుడారై వేడుకలు


కుడారై సమర్పించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవికి ప్రీతికరమైన కుడారై (పాయసం) నివేదన, లక్ష తులసీ దలార్చన వేడుకలను వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పాయసాన్ని తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నివేదించారు. పదిసార్లు విష్ణుసహస్ర నామార్చన, 10మంది అర్చక బృందంచే లక్ష తులసీ దళాలతో అర్చన జరిపించారు. అర్చకులు పంచరాత్ర ఆగమం, శ్రీవైష్ణవ సంప్రదాయంలో తిరుప్పావై పాశురాలను వినిపించారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, తరుణ్ కుమార్‌శర్మ, దీవీ హయగ్రీవాచార్యులు, సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి


శిల్పా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాగిని రెడ్డి

నంద్యాల(సిటీ): మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిల్పా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శిల్పా మహిళా బ్యాంక్ చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి కోరారు. శుక్రవారం బొమ్మలసత్రంలో శిల్పా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలో టైలరింగ్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు.

'జగనన్న సురక్ష'లో మెరుగైన వైద్యం


మహిళకు కేషీట్ అందిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని చాబోలు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు, మందుల కౌంటర్లను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. అనంతరం ఏఏ మందులు ఎక్కువగా అవసరమవుతున్నాయి. ఎన్ని కేసులను శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, సర్పంచ్ మౌనిక, కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు


ముక్తర్‌కు పింఛన్‌ను అందచేస్తున్న వలంటీర్

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ ఆఫ్రిన్ కుమారుడు ముక్తర్ కిడ్నీ సంబంధిత జబ్బుతో ఏడాది నుంచి బాధ పడుతున్నాడు. ఆయనకు నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు ఇందుకు భారీగా ఖర్చవుతుండటంతో ఆఫ్రిన్ ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యాధికారులు, వలంటీర్ సలహాతో నవంబర్‌లో పింఛన్ కోసం దరఖాస్తు చేయగా ప్రస్తుతం నెలకు రూ.10వేలు మంజూరైంది. బాధితుడి తండ్రి మాట్లాడుతూ తక్కువ సంపాదనతో కుటుంబం గడవడమే గగనమైందని, అలాంటి పరిస్థితుల్లో డయాలసిస్ చేయించడం భారంగా మారిన క్రమంలో ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకుందని సంతోషం వ్యక్తం చేశాడు.

ఇరుముడితో శబరిమలకు


ఇరుముడితో బయలుదేరుతున్న అయ్యప్ప భక్తులు

దొర్నిపాడు: మండలకేంద్రం నుంచి అయ్యప్ప మాలధారులు శుక్రవారం ఇరుముడి ధరించి శబరిమలైకి బయలుదేరారు. అంతకుముందు వారు శివాలయంలో మాలధారులు కుటుంసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఊరేగింపుగా వీడ్కోలు పలికారు.

హుండీ సొమ్ము లెక్కింపు

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఉపాలయ హుండీ సొమ్మును శుక్రవారం లెక్కించారు. గతేడాది డిసెంబర్ 5 నుంచి ఇప్పటి వరకు భక్తుల సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి రూ. 79 వేలు ఆదాయం సమకూరింది. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈఓ నరసయ్య, చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ రంగులతో జాగ్రత్త

- మార్కెట్లో నాసిరకం రంగులు
- నాణ్యమైె వాటిని వాడితేనే మంచిది
- కల్తీ రంగులతో చర్మవ్యాధులు, కళ్ల జబ్బులు వచ్చే అవకాశం

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి వచ్చిందంటే చాలు ఇంటి ముంగిళ్లు రంగురంగుల ముగ్గులతో ముచ్చట గొలుపుతాయి. వాకిళ్లు సప్తవర్ణాలను పులుముకొని ముస్తాబవుతాయి. ఇంటి ముందు అందమైన ముగ్గులు వేయడానికి మహిళలు తెల్లవారుజాము నుంచే సన్నద్ధమవుతుంటారు. విభిన్నాకృతులు, వివిధ రకాల రంగులతో మహిళలు పోటీ పడుతూ రంగవళ్లులు వేస్తుంటారు.

కల్తీ రంగులతో జాగ్రత్త..

రంగులతో కొన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. డబ్బు దండుకోవాలని కొందరు ఎక్కువ రసాయనాలను కలిగిన కల్తీ రంగులను మార్కెట్లో విక్రయి స్తున్నారు. ఈ కల్తీ రంగులు లెడాక్సైడ్, జింక్ ఆక్సైడ్, క్యాల్షియం ఆక్సైడ్, సింథటిక్ కలర్, అల్యూమిని యం ఆక్సైడ్, కాపర్ సల్ఫేట్ వంటి రసాయనాలను కలపడం వల్ల ఆరోగ్యానికి హానికరమని నిపుణులు పేర్కొంటున్నారు. దగ్గు, చర్మ వ్యాధులు, జ్వరం, అజీర్తితోపాటు రంగులు కళ్లలోకి పడితే కళ్లుపోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏకాస్త ఏమరపాటుగా ఉన్నా ఊహించని పరిణామాలు వెంటాడుతాయి. బియ్యం పిండి, ఇసుక, ఉప్పు, ముగ్గు పొడి వీటికి ప్రకృతి సంబంధించిన రంగులు వాడితే పర్యావరణానికి హాని కలగదు.

ఆకర్షించేలా నకిలీ రంగులు..

☛ మార్కెట్లో దీపక్, గోపురం, స్వస్తిక్ లాంటి అనేక రకాల కంపెనీల రంగులు లభిస్తుంటాయి. ఇవి ఎక్కువగా గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతాయి. అయితే కొందరు వ్యక్తులు ఈ కంపెనీల పేరుతోనే నకిలీ రంగులను తయారు చేసి మార్కెట్లో అమ్ముతున్నారు.

☛ సాధారణ రంగుల కంటే నకిలీ రంగులు ఎక్కువ కలర్‌ఫుల్‌గా, జారిపోయే స్వభావాన్ని కలిగి ఉంటాయి. వినియోగదారులను ఆకర్షించేలా ఉంటాయి. నాణ్యమైన రంగులు రూ.200 నుంచి రూ.250 వరకు కిలో లభిస్తుండగా, నకిలీ రంగులు రూ.50 నుంచి రూ.80 వరకు లభిస్తున్నాయి.


రంగులు కొనుగోలు చేస్తున్న మహిళ

జాగ్రత్తలు ఇలా..

☛ రంగులు కొనుగోలు చేసేటప్పుడు జారిపోయే స్వభావం ఉన్నవాటికి దూరంగా ఉండాలి. ఆకర్షణీయంగా కనిపించడంతో పిల్లలు కొనుగోలు చేస్తుంటారు. అయితే చేతికి కొంచెం గరుకుగా అనిపించే రంగులను కొనుగోలు చేయండి. కొన్న తర్వాత అందులో సన్నటి ఇసుక లేదా ముగ్గురాయి, ఉప్పు కలిపితే బాగుంటుంది. రంగులు వేసేటప్పుడు మాస్కులు ధరించాలి.

☛ చేతికి గ్లౌజులు ధరించి రంగువేస్తే చర్మవ్యాధులను అరికట్టవచ్చు. ఈ గ్లౌజులు మార్కెట్లో రూ.10 నుంచి రూ.50 వరకు లభిస్తున్నాయి. ముగ్గుల్లో రంగులు వేశాక చేతులను కచ్చితంగా శుభ్రం చేసుకోవాలి.


బియ్యం పిండితో వేసిన ముగ్గు

అనాదిగా వస్తున్న సంప్రదాయమే



సంక్రాంతి పండుగ సమయంలో ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేయడం అనాదిగా వస్తున్నది. మా పెద్దల కాలంలో రంగులను ఇంట్లోనే తయారు చేసుకునేవారం. ఉప్పు, ఇసుక, బియ్యం పిండిలకు సహజ రంగులను కలిపి వాడుకునేవాళ్లం. ప్రస్తుతం మార్కెట్లో రసాయన, సింథటిక్ రంగులు లభిస్తున్నాయి. చివరకు వాటిని కూడా కల్తీ చేసేశారు. ముగ్గులు మహిళల నైపుణ్యాన్ని చాటి చెబుతాయి.

–నారాయణమ్మ, మహిళ, నంద్యాల

కల్తీ రంగులు వాడొద్దు

సంక్రాంతి ముగ్గుల్లో కల్తీ రంగులు వాడటం వల్ల చర్మవ్యాధులు, కళ్ల జబ్బులు తదితర వాటి బారిన పడాల్సి ఉంటుంది. కల్తీ రంగులు, ఆక్సైడ్‌లు ప్రాణహాని కాకపోయినా జీవిత కాలం బాధ పడాల్సి వస్తుంది. సహజ సిద్ధమైన రంగులను వాడటం వల్ల ఎటువంటి హాని ఉండదు. కల్తీ రంగుల వాడకంపై అప్రమత్తతంగా ఉండాలి.

–డాక్టర్ హరిత, చర్మవైద్యుల నిపుణురాలు

అభివృద్ధికి చిరునామాగా వైఎస్ నగర్


3వ వార్డులో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(సిటీ): పట్టణంలోని వైఎస్ నగర్‌ను అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శుక్రవారం రూ.కోటితో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైన్లు కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు వైఎస్సార్‌పీ ఇన్‌చార్జ్ రమణ, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అలాగే.. 3వ వార్డులో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, మంచి నీటి పైప్ లైన్ పనులను ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, కౌన్సిలర్ అబ్దుల్ సమ్మద్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, సీనియర్ నాయకులు నరసింహారావు, నాయకులు అన్వర్ బాషా, అంకాలయ్య, సోమశేఖర్, శివకృష్ణ, వెంకటస్వామి శెట్టి పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు తెచ్చిన ఘనత జగనన్నదే

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ సేవలు పొందాలంటే గతంలో రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కానీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు త్వరగా ప్రారంభోత్సవాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిరపకు రెండో తడి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న భూసర్వే, భూరక్షను రైతులకు తెలియకుండా సర్వే చేస్తున్నారని, పొలాల కొలతల్లో తేడాలు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి సభ దృష్టికి తీసుకురాగా.. వాస్తవమేనని.. సక్రమంగా కొలతలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన


సాంబవరంలో మహిళ సమస్యలను వింటున్న ఎమ్మెల్యే శిల్పారవి, పీపీ పీపీనాగిరెడ్డి

గోస్పాడు: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాంబవరం, పసరపాడు గ్రామాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేసి పథకాలు, లబ్ధి గురించి వివరించారు. అనంతరం సీసీ రోడ్లు, మురుగు కాలువలు, దర్గా ప్రహరీ, సాంబవరంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం రూ .70 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, ఎంపీటీసీలు భారతి, భక్తవత్సల రెడ్డి, సర్పంచులు ఐజయ్య, లలితమ్మ, నాయకులు బొబ్బిటి దామోదర్ రెడ్డి, బోరెడ్డి గోపాల్ రెడ్డి, గడ్డం ప్రసాద్ యాదవ్,శంకర్ రెడ్డి, శ్రీను, రాజన్న పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

దొర్నిపాడు: రబీలో సాగు చేసిన పంటలను రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండలస్థాయి సలహా కమిటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి సలహాకమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీలో సాగుచేసిన జొన్నలను మద్దతు ధరకు విక్రయించుకోవాలంటే ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం రూ.3,180 ప్రకారం కొనుగోలు చేస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సునీత ఉన్నారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు


ఉద్యోగికి ప్రశంస పత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ గంగాధర్

నంద్యాల టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో 2023 డిసెంబర్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులను డిపో మేనేజర్ గంగాధర్ రావు అభినందించారు. బుధవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కండక్టర్లు డీఎస్ఎస్ రాయుడు, శ్రీనివాస్, తిరుపాల్, రాజు, శేషన్న, డ్రైవర్లు రావు, స్వామి, హుస్సేన్, సామెల్, మల్లయ్యను అభినందించి ప్రశంశ పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి, స్టేషన్ మేనేజర్ బాషా పాల్గొన్నారు.

నేడు తుడుమలదిన్నెకు ఎమ్మెల్యే రాక

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె, గోవిందపల్లె గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడతారని చెప్పారు. వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తాం

నంద్యాల(న్యూటౌన్): ఏపీటీఎఫ్ వ్యవస్థాపకులు, సంఘానికి నిరంతరం స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో బాలకృష్ణమ్మ 11వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుల్లయ్య, మునిస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణుడు, మద్దిలేటి, రవి, ఖలీల్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసేందుకు టాటా సుమో వాహనాన్ని ఎత్తుకెళ్లిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకట్రామయ్య శుక్రవారం తెలిపారు. రూరల్ మండలం అహోబిలం గ్రామానికి చెందిన రంగస్వామి టాటా సుమో వాహనం ఈ నెల 4నుంచి కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తప వాహనాన్ని అపహరించుకు పోయారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా నాగేంద్ర, రాముడు, హనుమంతు, రాంబాబు మరి కొందరితో కలిసి ప్రొద్దుటూరులో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు వాహనాన్ని తీసుకెళ్లినట్లు ఒప్పుకోవడంతో నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు. సీఐ హనుమంత్ నాయక్, ఎస్‌ఐ నరసింహులు ఉన్నారు.

గ్రామీణులకు ఆధునిక వైద్యం

దొర్నిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణులకు ఆధునిక వైద్యం అందుతుందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు భార్గవి, సోమశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి 423 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఎంఈఓ రామచంద్రయ్య, సర్పంచ్ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు జాకీర్ బాషా, శాంతయ్య, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి, వరప్రసాద్ పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి


స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(వ్యవసాయం)/నంద్యాల(న్యూటౌన్): విశ్వానికి భారతీయతను చాటిన స్వామి వివేకానంద నేటి యుతరానికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వివేకాంద 162వ జయంతిని పురస్కరించుకొని స్థానిక వివేకానంద కూడలిలో స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రామకృష్ణారెడ్డి, మేడా మురళీధర్, శ్రీనివాససింగ్, నాగేంద్ర, చలంబాబు, అన్నెం శ్రీనివాసరెడ్డి, పుల్లయ్య, రమణ, మహేష్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్, అభిరుచి మధు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో..

గౌరవాధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్ ఆధ్వర్యంలో వివేకానందుడి కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సంతోష్, దండు వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య పాల్గొన్నారు. బైటిపేటలో జిల్లా అకౌంటెంట్ బాలవీరయ్య ఆధ్వర్యంలో, లయన్స్‌క్లబ్ కార్యాలయంలో అధ్యక్షుడు పీవీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బధిర టెన్నిస్ టోర్నమెంట్‌లో పలు పతకాలు సాధించిన నంద్యాలకు సాయిచందన్‌కు జాతీయ యువజన దినోత్సవ పురస్కారం అందించి సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(వ్యవసాయం): 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి కృషి చేద్దామని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఓల్డ్ సూరజ్‌లో పార్టీ పట్టణ లీగల్ సెల్ న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదల పక్షపాత ప్రభుత్వంగా గుర్తింపు పొందిన వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల కుట్రలు, కుతంత్రాలు, అక్రమ కేసులను బనాయిస్తే తిప్పి కొట్టడానికి సంసిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు విజయశేఖర్‌రెడ్డి, పెద్ది శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సిద్ధం శివరాం, అమర్‌నాథ్‌రెడ్డి, రమేష్‌బాబు, బొల్లెద్దుల రవి, వివేకానందరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాకృష్ణారెడ్డి, పెద్దస్వామి, తిమ్మారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖల చెందిన అధికారులు వారి శాఖల వారీగా అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ మాధవి,ఏడీఏ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న గంధం రాఘవరెడ్డి

ఆళ్లగడ్డ: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ సమావేశ భవనంలో శుక్రవారం పాలకవర్గ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ వ్యయాలను పరిశీలించి ఆమోదించారు. మార్కెట్ కమిటీ ఆదాయం రుసుముపై 20 శాతం పెన్షన్ కాంట్రీబ్యూషన్ కింద సీఎంఎఫ్ఎస్ ద్వారా కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. కమిటీ సభ్యులు, సెక్రటరీ నారాయణస్వామి ఉన్నారు.

14న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తరిగోపుల గ్రామంలో ఈనెల 14వ తేదీన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరి సైజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 986686123, 9676267969 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హోరా హోరీగా కబడ్డీ పోటీలు


ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


డబ్ల్యూ గోవిందిన్నె జట్టుతోఅధికారులు


ఫైనల్‌కు చేరిన కబడ్డీ జట్టుతో నిర్వాహకులు

ఉయ్యాలవాడ : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గ్రామస్థాయిలో గెలుపొందిన కబడ్డీ జట్లు మండల స్థాయిలో తలపడ్డారు. కొండుపల్లె గ్రామ సచివాలయం జట్టు మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో వీరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రకటించారు. టీం సభ్యులను ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ రహీం, రాజశేఖర్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు బుచ్చిబాబు, నరసింహుడు అభినందించారు.

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె జట్టు క్రికెట్ పోటీల్లో తాలుకా స్థాయికి ఎంపికైంది. శుక్రవారం దొర్నిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె జట్లు తలపడగా డబ్ల్యూ గోవిందిన్నె టీం విజయం సాధించింది. గెలుపొందిన జట్టును ఎంపీడీఓ సుబ్బారెడ్డి అభినందించారు.ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జున, వెంకటనారాయణ, మహేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి కబడ్డీ పోటీల్లో కొత్తపల్లె-1 జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. చాపిరేవుల మార్నింగ్ స్టార్ స్కూల్ ఆవరణలో జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీల్లో అయ్యలూరు-2 జట్టుపై కొత్తపల్లె-1 జట్టు విజయం సాధించింది. అంతకు ముందు అయ్యలూరు-2- అయ్యలూరు-1 జట్లు తలపడగా అయ్యలూరు-2 విజయం సాధించింది. కొత్తపల్లె-1-పులిమద్ది జట్లలో కొత్తపల్లె-1, పోలూరు-పాండురంగాపురం జట్లలో పోలూరు, చాబోలు-అయ్యలూరు-2 జట్లలో అయ్యలూరు, బిల్లలాపురం-పెద్దకొట్టాల జట్లలో పెద్దకొట్టాల, పోలూరు-కొత్తపల్లె-1లో కొత్తపల్లె-1, పెద్దకొట్టాల-అయ్యలూరు-2 జట్లలో అయ్యలూరు-2 జట్టు విజయం సాధించింది. చివరగా అయ్యలూరు-2 కొత్తపల్లె-1 జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో కొత్తపల్లె-1 జట్టు విజయకేతనం ఎగురవేసింది. గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయిలో ఆడనుంది. పోటీలను ఎంపీడీఓ సుగుణశ్రీ, కోచ్, పిచ్చిరెడ్డిలు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి అంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డీ1, డీ2, డీ3 సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ, స్తంభాల మరమ్మతులు చేస్తుండటంతో సరఫరాను నిలిపి వేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిధుల మంజూరు

శిరివెళ్ల: గ్రామ పంచాయతీలకు 2023–24 ఆర్థిక సంవత్సం 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీకి రూ.14.30 లక్షలు, యర్రగుంట్ల రూ. 5.47 లక్షలు, గోవిందపల్లెకు రూ.5.48 లక్షలు, బోయలకుంట్ల రూ.2.49 లక్షలు, చెన్నూరు రూ.2,31 లక్షలు మంజూరయ్యాయి. గంగవరం రూ.1.50 లక్షలు, గుంప్రమాన్‌దిన్నెకు రూ.2.55 లక్షలు, గుండంపాడు రూ.1.43 లక్షలు, జీనేపల్లె రూ.1.06 లక్షలు, కామినేనిపల్లె రూ.1.20 లక్షలు, కోటపాడుకు రూ.1.87 లక్షలు, మహదేవపురం రూ.2.17 లక్షలు, మోత్కులపల్లె రూ.92 వేలు, వనికినిదిన్నె రూ.86 వేలు, వీరారెడ్డిపల్లె రూ.90 వేలు, వెంకటాపురానికి రూ.1.08 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.